www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 డిసెంబర్ 2022

ఐఎంఎలో ఎమ్మెల్సీ ఓటు నమోదు

కడప అర్బన్ : నగరంలోని ఐఎంఎ హాలులో ఎంఎల్‌సి ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు డాక్టర్ ఫరూక్ పేర్కొన్నారు. ఆదివారం ఓటర్ల నమోదు కార్యక్రమానికి వైద్యులు హాజరయ్యారు. ఈ నెల 9 వరకు అవ కాశం ఉందని డాక్టర్ అవ్వారు అర్జున, డాక్టర్ సత్యానంద్, మరికొంత మంది ఓటు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫరూక్ మాట్లాడుతూ అవకాశాన్ని ఐఎంఎ సభ్యులు, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్, వైద్యులు, బడ్లే 2 లివ్ వ్యవస్థాపకులు పట్టుపోగుల పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకుంటున్న అవ్వారు అర్జున

విత్తన నాణ్యతకు పెద్దపీట

కడప జిల్లాలో 10 వేల క్వింటాళ్ల వేరుశనగ,
అన్నమయ్యలో 60 వేల క్వింటాళ్ల విత్తనం సిద్ధం
40 శాతం సబ్సిడీతో విత్తనం అందజేత
ఎపి సీడ్స్ జిల్లా మేనేజర్ కె.జగదీష్ వెల్లడి

నాణ్యమైన విత్తన సరఫరా చేయడానికి ప్రాధాన్యత ఇస్తాం. ప్రతి ఏటా ఆయా జిల్లాల్లో ఎంపిక చేసిన పొలాల నుంచి వేరుశనగ, పొద్దుతిరుగుడు, బుడ్డశనగ, పచ్చిరొట్ట విత్తనాలు వంటి పలు పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాన్ని సేకరించడం తెలిసిందే. ఈ ఏడాది అనంతపురం జిల్లా నుంచి నాణ్యమైన విత్తనాన్ని సేకరించాం. వేరుశనగ విత్తనాన్ని 40 సబ్సిడీతో ఆర్‌బికెల ద్వారా రైతాంగానికి అందజేస్తాం. ఎపిసీడ్స్ మార్కెట్లో ఉన్న కారణంగా బయటి మార్కెట్లో ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి, లేని పక్షంలో ధరలు అమాంతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఏతా వాతా తేలేదేమిటంటే ఎపిసీడ్స్ కొనుగోళ్ల కారణంగా మార్కెట్లో ధరల స్థిరీకరణ కొనసాగుతుందని ఘంటాపథంగా చెప్పవచ్చనడంలో సందేహం లేదు.

-ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి

ఎపి సీడ్స్ విత్తన కొనుగోళ్ల గురించి తెలపండి?

కడప, అన్నమయ్య జిల్లాల్లో ఎంపిక చేసిన పొలాల నుంచి నరసప్పుడు ధర ప్రాతిపదికన రైతుల నుంచి విత్తనాన్ని సేకరించడం జరుగుతోంది. ఈ ఏడాది కడప జిల్లాలో 10 వేల క్వింటాళ్ల వేరుశనగ, అన్నమయ్య జిల్లాలో 60 వేల క్వింటాళ్ల వేరుశనగ, 29 వేల క్వింటాళ్లలో బుడ్డశనగ, 200 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు, ఆరు వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేశాం. ఎపి సీడ్స్ మార్కెట్ ప్రవేశం కారణంగా బహిరంగ మార్కెట్లో ధరలు అదుపులో ఉండటాన్ని ప్రత్యక్షంగా గమనించొచ్చు.

ప్రొక్యూర్మెంట్ విధానం గురించి చెప్పండి?

ఎపి సీడ్స్ విత్తన సేకరణకు సంబంధించి టెండర్లు పిలుస్తాం. అర్హత కలిగిన కంపెనీని ఎపి సీడ్స్ రాష్ట్ర ఉన్నతాధికారులు ఎంపిక చేస్తారు. ఈ ఏడాది వరద అగ్రిటెక్, గంగాధర, సుబ్రమణ్యేశ్వర వెంకటేశ్వర, కర్నిస్టీడ్స్ ఏజెన్సీలు పాల్గొన్నాయి. రెండు, మూడు దశల్లో ల్యాబ్ టెస్టింగ్ అనంతరం నాణ్యతను నిర్ధారించాం. విత్తన నిర్ధారణ అనంతరం జమ్మలమడుగు పట్టణ శివారులోని మార్కెట్ ప్రయివేటు వేర్‌హౌసింగ్ గోడౌన్‌లో నిల్వ చేశాం.

విత్తన నాణ్యతను ఎలా నిర్ధారణ చేస్తారు?

కడప, అన్నమయ్య జిల్లాల్లో ఎంపిక చేసిన పొలాల నుంచి విత్తనాన్ని కొనుగోలు చేస్తాం. విత్తన నాణ్యతకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు టెస్టింగ్, స్క్రీనింగ్, ఆస్టెక్టెడ్ వంటి సదుపాయాలను పరిశీలించిన తర్వాత కొనుగోలు చేస్తాం.

విత్తన సరఫరా గురించి తెలపండి?

కడప, అన్నమయ్య జిల్లా పరిధిలోని ఆర్బీకేలకు టెండరు దక్కించుకున్న ఏజెన్సీలు తమ వాహనాల ద్వారా సరఫరా చేస్తాం. కడప జిల్లాలో 280 ఆర్బీకేలు, అన్నమయ్య జిల్లాలో 390 ఆర్బీకేలకు సరఫరా చేయడం పరిపాటిగా మారింది. అన్నమయ్య జిల్లాలోని 11 మండలాల పరిధిలోని 186 ఆర్బీకేలకు 29 వేల క్వింటాళ్ల మేర రూ.14 కోట్ల విలువైన బుడ్డశనగ విత్తనాన్ని, మరో తొమ్మిది మండలాల్లో 22 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు విత్తనాన్ని పొజిషన్ చేశాం.

సబ్సిడీ తగ్గడలకు కారణమేమిటి?

విత్తన సబ్సిడీ హెచ్చుతగ్గులు ప్రభుత్వ పరిధిలోని అంశం. ఈ ఏడాది 40 శాతం సబ్సిడీతో వేరుశనగ, 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనం, 25 శాతం సబ్సిడీతో బుడ్డశనగ విత్తన సబ్సిడీలతో అందజేస్తున్నాం.

మార్కెట్ల పోటీ గురించి వివరించండి?

బహిరంగ మార్కెట్ల నుంచి పోటీని ఎదుర్కొంటుంది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో పొద్దుతిరుగుడు విత్తనాలు ఎపి సీడ్స్ ధర రెండు కిలోల ప్యాకెట్ రూ.2,400 కాగా, ప్రయివేటు వ్యాపారులు రూ.200 తగ్గించి రూ.2,200 ధరలకు విక్రయిస్తున్నారు. ఎపి సీడ్స్ తగ్గిస్తే ప్రయివేటు వ్యాపారులు కూడా తగ్గించే అవకాశాలను స్పష్టంగా గమనించాం. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులను సంప్రదించాల్సిన అవసరం ఏర్పడింది. ఇటువంటి పోటీ వాతావరణం కారణంగా రైతులకు ప్రయోజనం లబ్ధిచేకూరుతోందని చెప్పవచ్చు. ఒకరకంగా ధరల స్థిరీకరణ ఎపి సీడ్స్ కారణమవుతోందని చెప్పవచ్చు.

ఎపిసీడ్స్ వ్యాపార సరళి ఎలా నడుస్తోంది?

2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.60 కోట్ల మేర వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాం. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో రూ.50 కోట్ల వ్యాపారం నడిచింది.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

నూర్‌బాష్ దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.రాజకిషోర్‌బాబు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

విద్యతో సమ సమాజాభివృద్ధి సాధ్యమని నూర్‌బాష్ దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు గగ్గుటూరి రాజకిషోర్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం ఎర్రముక్కపల్లిలోని దూదేకుల భవన్‌లో నూర్‌బాష్ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య, సాంకేతిక రంగాల పురోభివృద్ధిపైనే ఆరోగ్యవంతమైన సమాజం ఆధారపడి ఉందన్నారు. ఇంతటి కీలకమైన రంగాల పట్ల దూదేకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో పేదరికం కారణంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సాహం అందించాలని కోరారు. సంఘం నాయకులు పేదరికం కారణంగా నిలిచిపోయిన ప్రతిభావంతులను గుర్తించి ఆదుకునే ప్రయత్నం చేయాలన్నారు. ఇటువంటి ఆలోచనలు కార్యరూపం దాల్చడానికి ఉద్దేశించి రంగాల వారీగా కమిటీలను ఏర్పాటును ప్రస్తావించడంతోపాటు సంబంధిత అంశాల పట్ల ఆసక్తి కలిగిన వ్యక్తులను కమిటీ సభ్యులుగా నియమిస్తున్నామని ప్రకటించారు. దూదేకుల సమాజానికి చేయాలని ఆలోచన కలిగి, ఆసక్తి కలిగిన వ్యక్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రిటైర్డు కన్సరేటివ్ అధికారి బాదుషా మాట్లాడుతూ దూదేకుల సమాజానికి సేవ చేయడానికి తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. దూదేకుల సంఘం భవనానికి పై అంతస్తు నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఆర్థిక సాయం అందిస్తానని హామీనిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్, ఇంటర్ చదువులకు పేదరికం కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రతిభావంతులైన 100 మంది విద్యార్థులకు ఏటా రూ.500 చొప్పున రూ.50 వేలను ఇప్పటి నుంచి తన తదనాంతరం ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తానని పేర్కొన్నారు. చింతకొమ్మదిన్నెకు చెందిన వి.అమీనా అనే ఓ అనారోగ్య మహిళకు ల్యాబ్, మందుల, రహదారి అవసరాల నిమిత్తం రూ.13,700 అందజేశారు. సిఎం రిలీఫ్ ఫండ్ అందించడానికి అవసరమైన సహాయం చేస్తామని ప్రకటించారు. అనంతరం ఉప కమిటీలను నియమించారు. ఉద్యోగుల కమిటీ అధ్యక్షులుగా ఫకృద్దీన్, కార్యదర్శిగా కె.గంగయ్య, మహిళా కమిటీ అధ్యక్షులుగా అమ్మాజీ, కార్యదర్శిగా షెకీలాభాను, దూదేకుల సంఘం అభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా పగడాల సిద్ధయ్య, కార్యదర్శులుగా డి.జి.అక్బర్‌అలీ, జడ్పీ రిటైర్డు డిప్యూటీ సిఇఓ వెంకటప్రసాద్, భవన అభివృద్ధి కమిటీ అధక్షులుగా వి.ఖాదరయ్య, రిటైర్డు టీచర్ బి.సుభాన్‌లను నియమించినట్లు ప్రకటించారు. అనంతరం సభ్యత్వ నమోదు పత్రాలను సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కడప జిల్లా నూర్‌బాష్ సంఘం ప్రధాన కార్యదర్శి పాలగిరి చిన్నపీరయ్య, కోశాధికారి సిద్ధయ్య, రిటైర్డు జడ్‌పి డిప్యూటీ సిఇఓ వెంకటప్రసాద్, రిటైర్డు సైనిక సంఘం నాయకులు చెంద్రాయుడు, సుభాన్, నజీర్, అజ్మత్, అక్బర్‌అలీ, బాబయ్య, పలువురు సంఘం సభ్యులు హాజరయ్యారు.

బాధిత మహిళకు నగదు అందజేస్తున్న రాజకిషోర్‌బాబు

బిసి నయవంచన సభగా నామకరణం చేయాలి

ప్రజాశక్తి - కడప

విజయవాడలో ఈనెల 8న వైసిపి నిర్వహించబోయే జయహో బిసి సభను బిసి నయవంచన సభగా నామకరణం చేయాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ సూచించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ రాంప్రసాద్‌తో కలసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 650 పైగా బిసిలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని చెప్పారు. 2500 మంది మీద తప్పుడు కేసులు బనాయించి వేధించారు అని అన్నారు. టిడిపి ప్రభుత్వంలో భారీ స్థాయిలో అమలు చేసిన సంక్షేమ పథ కాలను వైసిపి ప్రభుత్వం వచ్చాక నిలిపివేయడం బీసీ సంక్షేమం అంటారా...? అని ప్రశ్నించారు. 56 బిసి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఏడాదైనా ఇంకా వాటికి నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. బీసీలకు వృత్తులపరంగా పనిముట్లను ఇచ్చే ఆదరణ పథకాన్ని నిలిపివేయడం దారుణమని వాపోయారు. బీసీ ఎస్సీ ఎస్టీలకు ఉన్నత విద్య అభ్యసించేందుకు ఇచ్చే ఫీజు రియంబర్స్‌మెంట్, విదేశీ విద్య పథకాన్ని నిలిపేయడం ఏమిటని ప్రశ్నించారు. బీసీలను ఆర్థికంగా రాజకీయంగా అన్యాయం చేసి నిర్వహిస్తున్న ఈ సభను బీసీ నయవంచన సభ అనడమే సబబు అన్నారు. సమావేశంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నబీకోట శ్రీనివాసులు, యాదవ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వికాస్ హరికృష్ణ

'అంబటి'ని కలిసిన ఎన్‌జిఓ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప రోడ్డు భవనాల శాఖ అతిథిగృహంలో నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబును ఆదివారం ఎపి ఎన్‌జిఓ జిల్లా నాయకులు మర్యాదపూరంగా కలిసిశారు. మంత్రిని సన్మానించారు. మంత్రి వెంట మేయర్ సురేష్‌బాబు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవికుమార్, జిల్లా నాయకులు శ్రీనివాసులు, నరసింహారెడ్డి, నగర అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వరరెడ్డి, నాయకులు శ్రీను, పద్మనాభం, నాగార్జున, గౌస్ పాల్గొన్నారు.

చంద్రబాబే రాష్ట్రానికి కర్మ

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే రాష్ట్రానికి కర్మ అని ప్రభుత్వ చీఫ్‌విప్ చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. తిరుమల నుంచి శ్రీశైలం వరకు చేస్తున్న పాదయాత్ర ఆదివారం పోరుమామిళ్ళకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని పాదయాత్ర చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లల్లో 98 శాతం హామీలు అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజల చెంతకే పథకాలు అందేలా వాలంటరీ వ్యవస్థను తీసుకొచ్చారని చెప్పారు. పాదయాత్రకు ఎంఎల్‌సి డి.సి. గోవిందరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు పి. నాగార్జునరెడ్డి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, ఎంపిపి బాష, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి శారదమ్మ, డాక్టర్ మర్కారెడ్డి, యువనాయకులు ఆదిత్యరెడ్డి, గిరి ప్రణీత్‌రెడ్డి సంఘీభావం తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

కడప అర్బన్ : నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీలో ఉన్నా టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వి.ఎస్.అమీర్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండారెడ్డి ఆదివారం ఇదేం కర్మ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్‌కు ఓటువేయడంతో పోలవరం పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని పోయిందని చెప్పారు. అభివృద్ధి కుంటుబడిందన్నారు. వైసిపి పాలనకు చరమగీతం పాడేందుకు సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి జయకుమార్, రవి శంకర్‌రెడ్డి, ఇమ్రాన్, కొమ్మలపాటి సుబ్బరాయుడు, ప్రేమ్ కుమార్, దస్తగిరి, వరప్రసాద్, రాఘవేంద్ర చాంద్‌బాష పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

చేనేత పరిశ్రమ కుదేలు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టు, నూలు ధరల పెరుగుదలతో చేనేత పరిశ్రమ కుదేలైయిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కడప జిల్లా కమిటీ వీరనాల శివ నారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం పనిచేస్తుందని పేర్కొన్నారు. చేనేతను రక్షిస్తానని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాలు విస్మరించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేతకు అవసరమైన నూలు పట్టు ధరలు నూటికి నూరు శాతం పెంచిందని పేర్కొన్నారు. పట్టుదర రూ.3800 నుండి రూ.7వేలకు, నూలు ధర రూ.1100 నుండి రూ.2 వేలకు పెంచారని వాపోయారు. దీంతో చేనేత పరిశ్రమ సంక్షోభంలో కురుకుందన్నారు. ఇది చాలదన్నట్లు చేనేతపై జిఎస్‌టి పన్ను 12 శాతానికి పెంచాలనే ఆలోచన దుర్మార్గపుతో పరిశ్రమ చీకటిలోకి నెట్టినట్లు అయిందన్నారు. మహాత్మా గాంధీ బంకర యోజన, బీమా పథకాల ద్వారా 59 ఏళ్లకు చేనేత చనిపోతే రూ. 60 వేలు ఇచ్చేవారని, కార్మికులకు ఐసిఐసిఐ లాంబార్డ్ స్కీం కింద హెల్త్ ప్యాకేజీ సంవత్సరానికి రూ. 30 వేలు ఇచ్చేవారని చెప్పారు. వీటిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2017లో రద్దు చేసిందని వాపోయారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తను పాదయాత్ర సందర్భంగా తను అధికారంలోకి వస్తే చేనేత పరిశ్రమ రక్షిస్తానని వాగ్దానం చేశారు. ఆయన అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత చేనేత పరిశ్రమను మరణశయ్యపైకి నెట్టేశారని వాపోయారు. చేనేత పరిశ్రమకు బడ్జెట్లో కేటాయింపులు లేకుండా చేయడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం పథకం కింద రెండు లక్షల మగ్గాలు ఉండగా కేవలం 81 వేల 700 మందికి మాత్రమే అమలు చేయడంతో మిగిలిన 1,20,000 మంది అన్యాయానికి గురయ్యారని వాపోయారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి చేనేత కార్మికునికి ఉపవృత్తుల వారికీ వైఎస్‌ఆర్ నేతన్ననేస్తం పథకం అమలు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికీ చేనేత గుర్తింపు కార్డులు లేక 60ఏళ్లు దాటిన వారు పింఛనుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముద్ర రుణాలు చేనేత కార్మికులు అందే విధంగా బ్యాంకులను ఒప్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం రూ. 5 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్లు కేటాయించాలని చెప్పారు. చేనేత సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి డక్క ఓబులేష్, చేనేత కమిటీ సభ్యులు డి వెంకటసుబ్బమ్మ, ఎం వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు, చౌడం సంజీవ రాయుడు, బి. గోవర్ధన్, మలక వెంకటకృష్ణ, ఉమ్మడిశెట్టి జ్యోతి, పి వసంత, కె. సావిత్రి, రంగప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

ఒకటో తేదీనే వేతనాలు ఇవ్వాలి : విద్యుత్ జెఎసి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీ జీతాలు ఇవ్వాలని యుఇఇయు, విద్యుత్ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని విద్యుత్ భవన్ వద్ద జిల్లాలోని విద్యుత్ యూనియన్లు, అసోసియేషన్స్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీ యాజమాన్యం జీతాలు చెల్లించికపోవడంతో ఉద్యోగులు అభద్రతా భావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థ ప్రభుత్వంలో ఎమర్జెన్సీ సేవా విభాగం అయినప్పటికీ యాజమాన్యం కానీ, ప్రభుత్వం కానీ విద్యుత్ సంస్థల పట్ల, ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వాపోయారు. యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ వేతనాల చెల్లింపులో జాప్యం చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. 5 లోపల చెల్లించకుంటే 6న అన్ని విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం, పిఆర్‌సి, ఇపిఎఫ్ టు జిపిఎఫ్ ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాబోయే రోజుల్లో సమస్యలు పరిష్కారం కాకుంటే ఉద్యమాలకు సిద్ధం కావాలని విద్యుత్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఉద్యోగ అసోసియేషన్ నాయకులతో చర్చించిన మీదట ఈ కార్యక్రమం చేపట్టినట్టు పేర్కొన్నారు. సమావేశంలో జెఎసి జిల్లా చైర్మన్, 1104 జిల్లా అధ్యక్షులు బర్నబాస్, తెలుగు నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సి. కష్ణయ్య, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం ప్రెసిడెంట్ ఎన్. శివశంకర్, జేఏసీ కన్వీనర్, 327అధ్యక్షులు చలపతి, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామలింగారెడ్డి, ఒసి నాయకులు రమేష్ రెడ్డి, ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షులు బాబర్ బేగ్, బహుజన డిస్కం అధ్యక్షులు జయప్ప,ఎస్సీ ఎస్టీ నాయకులు యాకోబ్, బీసీ నాయకులు మురళి, ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు నాగరాజు, డిప్లమో అసోసియేషన్ నాయకులు నాగరాజు, ఎస్టి నాయకులు పరశురాం, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు బి.నాయబ్ రసూల్, తెలుగు నాడు కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్ ఎదుట సమావేశమైన యుఇఇయు, జెఎసి నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పశ్చిమ రాయలసీమ టీచర్స్, గ్రాడ్యు యేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక పశ్చిమ రాయలసీమ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడతూ ప్రధాన పాలక, ప్రతిపక్ష మద్దతుదారులైన వారి అనుచరులు ఓటు మార్ఫింగ్ విధానం తీసుకొచ్చి పెట్టారని దీనిపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా పెట్టి అనర్హుల ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ పెద్దలు, ప్రభుత్వ అనుకూల ఉన్నత అధికారులు కొత్తగా ఓటు నమోదు చేసుకునే ఓటర్లను ప్రలోభాల గురిచేసి, అడ్వాన్స్ ఓటు బుకింగ్ విధానాన్ని అనుసరిస్తున్నారని చెప్పారు. ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమైన చర్య నని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై ఎన్నికల కమిషన్ క్రిమినల్ చర్యలు చేపట్టాలని కోరారు. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను ధనస్వాములు ఆక్రమించారని, కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయుల, గొంతుక వినిపించే అవకాశం ఉన్న ఏకైక శాసనమండలి ఎన్నికల ప్రక్రియ కూడా ధన రాజ కీయాలు ఆక్రమించుకోవడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. కాబట్టి విద్యావంతులైన ఓటర్లు దీన్ని తిప్పి కొట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. అర్హులైన ఓటర్లు ఓటునమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.పాపిరెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, వేంపల్లె మండల గౌరవ అధ్యక్షులు వన్నూరు భాష, రామకృష్ణారెడ్డి, ఎస్‌టియు నాయకులు రాజశేఖర్, రంగారెడ్డి, ఎన్.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జి.చంద్రశేఖర్

అనాథలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలోని రెండు నిరుపేద కుటుంబాలకు ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగి యాదల సుబ్రహ్మణ్యం రూ. 10 వేల నగదు ఆర్థిక సాయం చేశారు. ఆదివారం సచివాలయ సిబ్బంది నాగేంద్ర, వారి స్నేహితులు కలిసి నిరుపేద కుటుంబాలకు అందజేశారు.

11న ప్రత్యామ్నాయ పార్టీల సమావేశం

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీల సమావేశం నగరంలోని నాగరాజుపేటలో ఈ నెల 11న రాష్ట్ర స్థాయి ప్రత్యామ్నాయ పార్టీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ న్యాయవాది అమీన్ పేర్కొన్నారు. ఆదివారం అమీన్ పీరా కార్యాలయం గుంటూరు నుంచి లోక్ తాంత్రిక్ జనతా దల్ రాష్ట్ర అధ్యక్షుడు భూరగా రత్నం ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పార్టీల సహచరుల అభ్యర్థుల సమలోచనల చర్చ సమావేశం పోస్టర్ల ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు సంగటి మనోహర్, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ సమన్వయకర్త, హైకోర్టు న్యాయవాది షేక్. అమీన్ పీరా పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - కడప

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 6న జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. ఆదివారం కడప ఎయిర్ పోర్ట్, పెద్దదర్గా ప్రాంగణం, మాధవి కన్వెన్షన్ ప్రాంతాలతో పాటు ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్ళే మార్గాలను ఎస్‌పి అన్బు రాజన్, జెసి సాయికాంత్‌వర్మ, కమిషనర్ ప్రవీణ్‌చంద్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా కడప ఎయిర్ పోర్ట్ , అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా) ప్రాంగణంలోని ముషాయిరా హాలు, దర్గా తదితర ముఖ్యమంత్రి కలియతిరిగే ప్రదేశాలను తనిఖీ చేశారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే అన్ని కార్యక్రమాలలో ప్రోటోకాల్ ఏర్పాట్లు, బందోబస్తు కార్యక్రమాల నిర్వహణలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు పెద్ద దర్గా వద్ద మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ. 6న ముఖ్యమంత్రి కడప నగరం పర్యటనలో భాగంగా పెద్ద దర్గాను సందర్శిస్తారని పెద్ద దర్గా అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన ఆరు ఎకరాల భూమిని అందించనున్నారని తెలిపారు. సమావేశంలో కడప, జమ్మలమడుగు ఆర్డీవోలు ధర్మ చంద్రారెడ్డి, శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, దర్గా కమిటీ సభ్యులు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

సిపిఎస్ రద్దు హామీని అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక మునుపు పాదయాత్రలో అడుగడుగునా దిక్కులు పిక్కటిల్లేల అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానంటూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి నాలుగేళ్లు కావస్తున్నా సిపిఎస్ రద్దు ఊసు ఎత్తకపోవడం ముఖ్యమంత్రి చేతకానితనానికి నిదర్శనమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు విమర్శించారు. ఆదివారం ఇంటింటికి యుటిఎఫ్‌లో భాగంగా ఓం శాంతి నగర్ లోని సిపిఎస్ ఉపాధ్యాయుల ఇళ్ల వద్దకు వెళ్లి సిపిఎస్ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఆవశ్యకతను తెలియజేశారు. సిపిఎస్ రద్దు కోరుతూ బ్యానర్ పై సంతకాలను, కరపత్రాలను పంపిణీ చేశారు. పాత పెన్షన్ విధానం తప్ప ఇతర ఏ ప్రత్యామ్నాయలకు అంగీకరించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎస్ కో-కన్వీనర్ అయ్యవారు రెడ్డి, నాయకులు బాబు, సూర్య ప్రకాష్, శివశంకర్, గంగన్న, సిపిఎస్ బాబు, విశ్వనాథ్, వీరనారాయణ, రామకృష్ణ, రసూల్‌బాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

సంతకాలు సేకరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

దాల్మియా కుటుంబ సభ్యులు

కార్మికులకు రక్షణ సౌకర్యాలు

- దాల్మియా సిమెంట్ ఇడి ముఖేష్ సిన్హా

ప్రజాశక్తి - కడప అర్బన్

గనులలో పని చేస్తున్న కార్మికులకు అవసరమైన రక్షణ సౌకర్యాలు తమ కంపెనీ కల్పిస్తుందని దాల్మియా సిమెంట్ పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి) ముఖేష్ సిన్హా అన్నారు. ఆదివారం మేడా కన్వెషన్ హాలులో 37వ గనుల రక్షణ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రక్షణ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వారం రోజులుగా రక్షణ చర్యలపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పరిశ్రమల్లో ప్రమాదాలకు గురి కాకుండా అన్ని రక్షణ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. జీరో ప్రమాదాలే తమ లక్ష్యమని తెలిపారు. తమకు సహకరిస్తున్న ఎపి, తెలంగాణ సిఎంలు జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సిమెంట్ పరిశ్రమల్లో రక్షణ చర్యలు తీసుకుంటున్న వారికి బహుమతులు ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ స్కిట్స్ ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో మైనింగ్ కంపెనీ హెడ్ సురేష్‌కుమార్‌రెడ్డి, దాల్మియా యాజమాన్యం మలైతిధ్కర్, సుప్రియో చక్రబోర్తి, ప్రతినిధులు, ఏజెంట్లు, డీలర్లు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక పెద్దదర్గా

కడప అర్బన్ : మత సామరస్యానికి ప్రతీక పెద్దదర్గా అని టిడిపి అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. ఆదివారం బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలదాసు మాట్లాడుతూ దేశంలోనే ఒక పుణ్యక్షేత్రంగా దర్గ నిలిచిందని పేర్కొన్నారు. కుల,మతాలకు అతీతంగా ప్రజలు దర్గాను సందర్శిస్తున్నారని చెప్పారు. పీఠాధిపతి సయ్యద్ షా మహమ్మద్ ఆరీఫుల్లాకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో టిడిపి నగర ఉపాధ్యక్షులు లింగన్న, శివశంకర్‌రెడ్డి, సయ్యద్ మహమ్మద్, బిసి సెల్ నగర ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్.ఇమ్రాన్ పాల్గొన్నారు.

8 నుంచి వ్య.కా.స రాష్ట్ర మహాసభలు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శివకుమార్, నాయకులు

ప్రజాశక్తి - మైదుకూరు

ఏపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలు ఏలూరు జిల్లాలోని జంగారెడ్డి గూడెంలో ఈనెల 8వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి.శివకుమార్ తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు స్థానిక సుందరయ్య నగర్‌లో ఆదివారం ఆయన గోడ పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారి వ్యవసాయ కార్మికులకు భూమి, ఇళ్లు, సామాజిక న్యాయం దక్కాలనే లక్ష్యంతో 1934లో నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కూలి సంఘాన్ని స్థాపించారని తెలిపారు. దేశవ్యాప్తంగా నేడు దాదాపు కోటి సభ్యత్వంతో కష్టజీవుల హక్కుల కోసం, చట్టాల సాధన కోసం సమరశీలంగా సుందరయ్య స్ఫూర్తితో సంఘం పోరాడుతోందన్నారు. బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ బృందాకారత్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విజయరాఘవన్, బి.వెంకట్, రైతు సంఘం నాయకులు వి.శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. గోడ పత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాయప్ప, మండల నాయకులు రవి, లక్ష్మమ్మ, లక్ష్మీదేవి, లక్ష్మమ్మ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

వృద్ధులకు అన్నదానం చేస్తున్న వార్డు మెంబర్ అంజి

ప్రజాశక్తి - వేంపల్లె

వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడం మహాభాగ్యమని 17వ వార్డు మెంబర్ అంజి పేర్కొన్నారు. ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ముత్యాల అంజి స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ముందుగా వైసిపి నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ అనాథలను ఆదుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సేవా భావం ఉన్న ప్రతి ఒక్కరిలో ఉండాలని కోరారు. తమ నాయకుడు చంద్రఓబుల్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను వృద్ధుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. 25ఏళ్ల నుండి వెంకటసుబ్బయ్య ఆశ్రమం పెట్టి అనాథ వృద్ధులకు ఆశ్రయం కల్పించడం ఆయన చేసుకున్న పుణ్యమని తెలిపారు. ఆశ్రమాలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. వార్డు మెంబర్ బండల షుకూరు ఆధ్వర్యంలో కూడా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి భారతి, వైసిపి నాయకులు దేవర్ల చంద్రశేఖర్‌రెడ్డి, వైసిపి ఎస్సీ సెల్ కన్వీనర్ కమతం రాజా, మైనార్టీ నాయకుడు బికారి, డీలర్ ముత్యాల రమేష్‌బాబు, రాజగోపాల్‌రెడ్డి, శ్రీను, ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య, జర్నలిస్టులు గఫార్, శ్రీనాథ్‌రెడ్డి, శివశేఖర రెడ్డి, రహీం, మనోహర్, వృద్ధులు పాల్గొన్నారు.

ఘనంగా మధు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి తొండూరు మండలం ఇన్‌చార్జి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేకును మదన్ మోహన్‌రెడ్డి కట్ చేశారు. అనంతరం చిన్నప్ప మాట్లాడుతూ పిలిస్తే పలికే నాయకుడు, స్నేహశీలి, సమస్య ఉందని ఆయన దగ్గరికి వెళితే వెంటనే సంబంధించిన అధికారులకు ఫోను చేసి దాన్ని పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

కేక్ కట్ చేస్తున్న వైఎస్ మధు

'సీమ' అభివృద్ధికి కలిసిరావాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాయలసీమ అభివృద్ధికి అన్ని పార్టీలు కలిసిరావాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలులో సోమవారం నిర్వహిస్తున్న రాయలసీమ గర్జన సభను విజయవంతం చేసేందుకు సమాయత్తం కావాలని కోరుతూ ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీమ వాసులు ఇంత వరకు నీళ్లు, నిధులు లేక అల్లాడిపోయామన్నారు. పేదరికం, కష్టాలతో జీవనపోరాటం చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా రాయలసీమ బిడ్డల్లా మనమందరం ఆలోచించాలన్నారు. మనలోని అనైక్యతను విడనాడాలన్నారు. సీమప్రాంత ప్రజల్లో చైతన్యం లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా సీమ ప్రాంతం వెనుకబడిందన్నారు. ఈ దోపిడీని కొనసాగనివ్వకూడదన్నారు. వైసిపి వారికే సీమ అభివృద్ధి కోరుకునే వారందరూ ఈ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం గర్జన గోడపత్రాలను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిదేవి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

మంత్రి 'అంబటి'కి సన్మానం

కడప అర్బన్ : జిల్లా పర్యటనకు వచ్చిన నీటి పారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబును ఆదివారం జిల్లా నీటిపారుదలశాఖ ఇంజినీర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈఈ ఖాజీ సాహెబ్ మంత్రికి శాలువా కప్పి, పూలమాల వేసి స్వాగతం పలికారు. జీ ఎన్ఎస్ఎస్ ఎస్ఈ మల్లి కార్జునరెడ్డి, ఇఇ వెంకటరమణయ్య, డిఇ మురళి కృష్ణ, వెంకటేశ్వర్లు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT CHENNAI (IV JUDGE,SCC) MCOP No.4624/2021

1.Shajahan
2.Fathimuthu Zohara ...Petitioner

Vs

1.Yarragondu Gurrappa S/o Naganna, Door No.13-529, Garugu Street,Kadapa, Vempalle, Vempalli,YSR Kadapa, Andhra Pradesh-614 329
2.Manager,TATA AIG Insurance Company Ltd, 15th Floor,Tower A,Peninsula Business Park, Ganpatrao Kadam Marg, Mumbai-400013 ..Respondents

I am here to state that on 21.09.2020 at about 01.00am Near T.Mavidanthal Bus Stop,Cuddalore District, the accident was made by the 1st Respondent to my client(Petitioners).My Client filed an case against you to claim damages on your side in MCOP No.4624/2021. If you have any objections regarding this you may appear before this Hon'ble court at 10am on 20-12-2022 either in directly as party in person or via an advocate to file your objections. If you fail to do that, the matter will be decided in an exparte.

Advocate for the petitioner
Sd/- Mrs. N.SAFIYA, B.Sc, B.L.,
Advocate, Enrl No.MS 2543/2013
Pattukotai,Thanjavur, Ph: 9629516572

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కడప అర్బన్ : శిల్పారామంలో మాచీ పద్మాకర్ బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఆదివారం జానపద, శాస్త్రీయ నృత్యాలు, సినిమా పాటలకు డ్యాన్సులు చేశారు. కార్యక్రమాలను శిల్పారామం ఎఒ పి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

అధ్వానం.. నక్కలదిన్నె-వెదురూరు రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నక్కలదిన్నె - వెదురూరు రోడ్డు అధ్వానంగా తయారైంది. కొన్ని నెలలుగా వెదురూరు గ్రామం వద్ద ఇసుక క్వారీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. లారీలు, ట్రాక్టర్లు అధిక లోడుతో ఇసుకను ఈ మార్గాన తరలిస్తున్నారు. దీంతో చాలా ప్రదేశాల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. చాపాడు నుంచి నక్కలదిన్నె వరకు గత వేసవిలో నూతనంగా రోడ్డును ఏర్పాటు చేశారు. నక్కలదిన్నె నుంచి వెదురూరు వరకు మరమ్మత్తులు మాత్రమే చేపట్టారు. అధిక లోడుతో ఇసుక తరలించే వాహనాలు ఈ మార్గాన ప్రయాణిస్తుండడంతో రోడ్డు దెబ్బతింది. గత వారంలో ఈ మార్గాన అదుపుతప్పి పడి ముగ్గురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మార్గాన తిప్పిరెడ్డిపల్లె, అనంతపురం, రాజుపాలెం, నరహరిపురం, వెదురూరు, కుచ్చుపాప గ్రామాల ప్రజలు ప్రయాణించాల్సి ఉంది.

నక్కలదిన్నె - అనంతపురం గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డు

రాయలసీమ గర్జన సభ హాస్యాస్పదం

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి కర్నూలులో రాయలసీమ గర్జన సభ పెట్టడం హాస్యాస్పదమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దొంగతనం చేసిన వ్యక్తే దొంగదొంగా అని కావు కేకలు పెట్టినట్లుందన్నారు. హైకోర్టు రాయలసీమకు రాకపోవడానికి టిడిపి ఎంత కారణమో వైసిపి కూడా అంతేనని తెలిపారు. రాజధాని, హైకోర్టు రెండు కూడా అమరావతిలోనే పెట్టాలని 2014 నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో తీర్మానం పెట్టగా, అప్పటి ప్రతిపక్ష నాయకుడు జగన్ పూర్తి మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. అందువల్లనే 2018న అమరావతిలో హైకోర్టు ఏర్పాటు చేస్తూ నాటి భారత రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. హైకోర్టు అమరావతిలోనే ఉంటుందని ఆ మేరకు న్యాయమూర్తులకు, సిబ్బందికి ప్రభుత్వం నివాస వసతి కల్పించిందని చెప్పారు. అమరావతి నుంచి హైకోర్టును కర్నూలుకు తరలించే అంశం ముగిసిన అధ్యాయమని వైసిపి ప్రభుత్వం తరుపున సీనియర్ న్యాయవాది కెకె వేణుగోపాల్ 2022 నవంబర్ 28న సుప్రీం కోర్టులో చెప్పారని అన్నారు. ఈ నైపథ్యంలో రాయలసీమ గర్జన సభను ఏర్పాటు చేసే నైతిక హక్కు వైసిపికి ఉందా అని తులసిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రం నడిబొడ్డులో ఉన్న రాజధానిని అమరావతి నుండి విశాఖకు తరలిస్తే రాయలసీమ ప్రజలకు మరింత దూరం అవుతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో రాయలసీమ ప్రజలు మోసగాని పార్టీ అయిన వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని తులసిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

ప్రజల ఆదరణ మరువలేనిది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గం ప్రజల ఆదరణ మరువలేనిదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చౌటపల్లె గ్రామంలో ఆదివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వారి దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సిఎం వైఎస్ జగన్‌కు మీ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు ప్రజలకు వివరించారు. ప్రతి గడపకు తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలను ఆరా తీశారు. పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో లక్ష్మీరెడ్డి, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పథకాల కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్, కడపకు చెందిన నవీన్ న్యూరో కేర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కడపకు చెందిన ప్రముఖ డాక్టర్ ఎస్‌వి నవీన్ ప్రసాద్ (న్యూరాలజిస్ట్), డాక్టర్ పి సతీష్‌కుమార్‌రెడ్డి (ఫిజియోథెరపిస్ట్) రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 212 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంఠ ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) ఉపాధ్యక్షుడు బైరిశెట్టి వెంకటసునీల్ కుమార్, ఆర్యవైశ్య సంఘం సభ్యుడు బైరిశెట్టి బాలగంగాధర్ మాట్లాడారు. అనంతరం వైద్యులను ఆవోపా సలహాదారుడు రాయవరం సురేంద్ర, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వడ్లకుంట రాజరావు సన్మానించారు. కార్యక్రమంలో గండి దేవస్థానం చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, గండి శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు రాయవరం శివరావు, వేంపల్లె అవోపా సెక్రటరీ రాధాకృష్ణ, సభ్యులు రాయవరం ద్వారాక, మధుసూధన్ గుప్తా, కృష్ణ, పోలేపల్లె సాయి, దారా మధుకర్, జిల్లా అవోపా సలహాదారుడు దొంతు సతీష్, దొంతు సుమన్ పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు నవీన్ ప్రసాద్

మైదుకూరు : మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హైదరాబాద్ ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ వారు ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరానికి వచ్చిన మైదుకూరు చుట్టుపక్కల గ్రామ ప్రజలను డాక్టర్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని వైద్య బృందం పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. తగు సలహాలిచ్చారు. హైదరాబాద్ ఏషియన్ వాస్కులర్ హాస్పటల్ సిబ్బందికి స్థానిక నాయ కులు బద్రిపల్లె సర్పంచు గుత్తి మల్లేశ్వరి, స్థానిక టిడిపి యువ నాయకులు గుత్తి వీర నారాయణ, మేకల బాబు, కొండపల్లి శేషగిరి సహకరించారు.

వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

పాదయాత్ర విజయానికి కృషి చేయాలి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ఈ నెల 9 నుంచి సిపిఐ చేపట్టిన పాదయాత్ర విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ కోసం పాదయాత్ర చేస్తున్న సిపిఐ నాయకులకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. వీరికి మద్దతుగా టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి పాదయాత్రలో ఆరోజు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పార్టీలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, కార్యవర్గ సభ్యులు రామయ్య, సుబ్బారెడ్డి, సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి శివనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, డివైఎఫ్ఐ శివకుమార్, సిపిఐ నియోజవర్గ కార్యదర్శి మిడుతూరు ప్రసాద్, లోకేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

యోగి వేమన విశ్వవిద్యాలయం శనివారం విడుదల చేసిన రెండవ సెమిస్టర్, నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో జమ్మలమడుగు ప్రభు త్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. 4వ సెమిస్టర్‌లో కళాశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. జమ్మలమడుగు ప్రభుత్వ 2వ సెమిస్టర్‌లో బిఎ గ్రూపులో జమ్మలమడుగు టౌన్ ఫస్ట్ యస్.ఇమ్రాన్‌బాషా 8.67 జిపిఎ, టౌన్ సెకండ్ బి రామతులసి 8.60జిపిఎ సాధించారన్నారు. 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించింది. 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో బిఎ గ్రూపులో జమ్మలమడుగు టౌన్ ఫస్ట్ కె.శివ నాగరాజు 8.37 జిపిఎ సాధించారు. బి.కాం, బిఎస్‌సి గ్రూపుల్లో కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి.చంద్రశేఖర్, వైఎస్ ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, ఎకనామిక్స్ అధ్యాపకులు ఎం.సుధీర్‌రెడ్డి ఇతర అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

ఎస్‌విడిసి విద్యార్థుల విజయభేరి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక గీతా ఆశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు వైవియు విడుదల చేసిన 2, 4 సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో యూనివర్సిటీ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ అర్కుటవేముల హరినారాయణ పేర్కొన్నారు. డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో బిఎస్‌సి బిజెడ్‌సిలో హస్నాభాను 9.84, డి ఆయేషా సనా 9.53, కె నందిని ప్రియ 9.41, సుమయ యాస్మిన్ 9.25, ఎంఎస్‌సి విభాగంలో జె ప్రియాంక 9.32, బికాం విభాగంలో కె వైష్ణవి 8.75, మహబూబ్ బి 8.80 జిపిఎ సాధించారు. డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాల్లో బిఎస్‌సి ఎంపిసిఎస్ విభాగంలో శ్రీ లక్ష్మీ ప్రసన్న 9.72, అనిత 9.32, ఛాయా శ్రీ 9.29, కె మౌనిక 9.58, వి ఇందూజ 9.24, బిఎస్‌సి బిజెడ్‌సి విభాగంలో వి నాగ సౌమ్య 9.64, నేహ నాయక్ 9.54, ఆలియా 9.02, ఎం స్వాతి 9.00, బిబిఎ విభాగంలో అబ్దుల్ రహమాన్ 8.75, సమీవుల్లా8.03, బికాం విభాగంలో సితార 8.15, పి పూజిత 8.07 జిపిఎ సాధించారని కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ రెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్స్ రామ్మోహన్, శ్రీకాంత్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

స్వచ్ఛతకు ఆటంకం కలిగిస్తే చర్యలు

పనులను పరిశీలిస్తున్న మనోహర్‌రెడ్డి, వరప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక భాకరాపురంలో చేపట్టిన నీటి పైప్‌లైన్ పనులను పురపాలక ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి లీకేజీలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో పలుచోట్ల జరుగుతున్న ఇంటి నిర్మాణ పనుల్లో వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా ఎక్కడ పడితే అక్కడ వదులుతుండడంతో, వాటిని ఆపి రూ.5000 జరిమానా విధించారు. స్వచ్ఛత పులివెందులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిషనర్ వివి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో ఎఒ తనిఖీ

దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎఒ మ్యాగీ

ప్రజాశక్తి - చాపాడు

అనుమతిలేని, కాలం చెల్లిన పురుగు మందులను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుని లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు పురుగు మందుల దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పురుగు మందులు కొనుగోలు చేసే ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. దుకాణాలలో స్టాక్ రిజిస్టర్ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. అనుమతి లేని బయో ఉత్పత్తులను చేపట్టకూడదన్నారు. రికార్డులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుదని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండల పరిధిలోని దుకాణాలను పరిశీలించామని ఎలాంటి సమస్యలు గుర్తించలేదన్నారు. కార్యక్రమంలో ఆయా దుకాణదారులు పాల్గొన్నారు.

శిక్షణలో మండల వ్యవసాయాధికారి

ప్రజాశక్తి - ముద్దనూరు

వివిధ రాష్ట్రాల వ్యవసాయ శాఖ అధికారులకు తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5నుంచి 9వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నారని, ఆ కార్యక్రమానికి తాను వెళుతున్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా నుంచి ఉన్నతాధికారులు తనను శిక్షణకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. శిక్షణా కాలంలో రైతులకు అందుబాటులో ఉండనని ఎఒ తెలిపారు. ఈ విషయాన్ని గమనించాలని రైతులను కోరారు.

దుంపలగట్టులో విశాఖ శారదా పీఠాధిపతులు

ప్రజాశక్తి - ఖాజీపేట

విశాఖ శారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర స్వామి ఆదివారం మం డలంలోని దుంపలగట్టుకు చేరుకున్నారు. స్వధర్మ వాహిని ప్రచార యాత్రలో భాగంగా విచ్చేశారు తవ్వా సుధీర్ కుమార్‌రెడ్డి కుటుంబానికి ఆశీస్సులు అందించారు.

శబరిమలకు ఐసిఎల్ ఉచిత బస్సులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఇండియా సిమెంట్ లిమిటెడ్ యాజమాన్యం శబరిమలై వెళ్ల అయ్యప్ప భక్తుల కోసం ఆదివారం రెండు ఉచిత బస్సులను ఏర్పాటు చేసింది. అయ్యప్ప మాల ధరించిన ఎర్రగుంట్ల పరిసర ప్రాంత, పట్టణానికి చెందిన 108 మంది శబరిమలై యాత్రకు బయల్దేరారు. కార్యక్రమాన్ని జెజిఎం వెంకటేశ్వరరావు, ఎజిఎం పృథ్వీరాజ్, వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం తథ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బలపరచిన అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విజయం తథ్యమని ఆ పార్టీ బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ పేర్కొన్నారు. రాం గోపాల్‌రెడ్డికి మద్దతుగా ఆయనతో కలిసి ప్రొద్దుటూరు, నందమూరి యువసేవా సమితి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు తమ ఓటును జాబితాలో చూసుకోవాలని వారు కోరారు. ఓట్లను నమోదు చేయడమే కాకుండా అత్యధిక మెజారిటీతో ఆ రాంగోపాల్‌రెడ్డిని శాసన మండలికి పంపేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కడప పార్లమెంటరీ బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.సత్యసాయి సుబ్బరాజు, కడప పార్లమెంటరీ ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి నాసారి లక్ష్మీనరసింహా, ప్రొద్దుటూరు సిబియన్ ఆర్మీ ఇన్‌ఛార్జి సిజె వెంకటసుబ్బయ్య, పట్టణ నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేధికమ్ సుదర్శన్, సి.లోకేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి శ్రేణులు

రిలయన్స్ నూతన స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని మారుతీ నగర్‌లో రిలయన్స్ ట్రెండ్స్ 3వ నూతన స్టోర్‌ని ఆదివారం కంపెనీ ప్రతినిధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక రూపంతో నాణ్యత, ఆకర్షణీయమైన దస్తుల శ్రేణిని కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. కడప ప్రజల అభిరుచికి అనుగుణంగా అందుబాటు ధరల్లో లభిస్తున్నాయని చెప్పారు. ఆధునిక ఉమెన్స్ వేర్, మేన్స్ వేర్, కిడ్స్ వేర్, ఫ్యాషన్ యాక్సరీస్ లభిస్తున్నాయని తెలిపారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయులు మృతి

ప్రజాశక్తి - మైలవరం

వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.హరిహర ప్రసాద్(58) గుండెపోటుతో మతి చెందారు. హరిహర ప్రసాద్ బంధువుల వివాహానికి ఆదివారం తిరుపతికి వెళ్లి, తిరుగు ప్రయాణానికి కారు వద్దకు రాగానే ఆయాసంగా ఉందని చెప్పగా.. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి గుండెపోటుతో చనిపోయారని చెప్పారని బంధువులు తెలిపారు. మృతదేహాన్ని ప్రొద్దుటూరుకు తీసుకొచ్చారు. తోటి ఉపాధ్యాయులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి భార్య బ్యాంక్ మేనేజరుగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు.

హరిహర ప్రసాద్ (ఫైల్ ఫోటో)

www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 5 డిసెంబర్ 2022

ఎత్తిపోతల పథకం ఆగదు : మంత్రి 'అంబటి'

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

మండల పరిధిలోని కుడమలూరు దగ్గర గతంలో ఏర్పాటు చేసిన ఒంటిమిట్ట పెద్దచెరువుఎ త్తిపోతల పథకం ఎట్టి పరిస్థితిలోనూ ఆగదని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం ఉదయం కుడమలూరు దగ్గర ఉన్న పంపు స్కీమును సందిరంచారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎత్తిపోతల పథకంపై ఎవరూ ఎలాంటి అపోహలు పడొద్దని, కొన్ని పత్రికల్లో వచ్చిన పిచ్చిరాతలను నమ్మొద్దని ప్రజలకు భరోసా ఇచ్చారు. వర్షాకాలంలో ఒంటిమిట్ట చెరువుకు వచ్చే నీటిని అధికారులు సమీకరిస్తారని, అనంతరం చెరువులో 0.3 శాతం టిఎంసి కంటే తక్కువ ఉన్న చెరువులోకి సరఫరా చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి జనార్ధన్ రెడ్డి. ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, శివారెడ్డి, శేషా రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఇరిగేషన్ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పెట్టుబడులు అధికం.. ధరలు పతనం

- గిట్టుబాటు ధరలు లేక టమోటా రైతుల పరిస్థితి దయనీయం
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వైనం
- పెట్టుబడులపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి -గుర్రంకొండ

పెట్టుబడులు అధికం, ధరలు పతనం ఇది టమోటా రైతుల దయనీయ పరిస్థితి. వాణిజ్య పంటల్లో ప్రధానమైనది టమోటా. ఈ పంటను రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేస్తుంటారు. ప్రస్తుతం టమోటా ధరలు పూర్తిగా పతనం కావడంతో అన్నదాతల కష్టం వృధాగా పోతోంది. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి తీవ్ర ఇబ్బందులతో సతమతమవుతున్నారు. మదనపల్లె డివిజన్‌లో ఎక్కువ మంది రైతులు పంటను నిర్విరామంగా సాగుచేస్తారు. ఆసియాలో ప్రసిద్ధిగాంచిన మదనపల్లె టమోటా మార్కెట్‌కు టమోటాలను తరలిస్తుంటారు. ఇటీవల ధరలు నిలకడగా లేకపోవడం ఆందోళన కలిగించే అంశం. పంటసాగు చేయడానికి ప్రస్తుతం ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. నారు కొనుగోలు చేసి నాటిని అనంతరం కలుపు తీయడం, కట్లు నాటడం, పుర్రి కట్టడం, కలుపుతీయడం, పంట కోయడం తదితర పనులకు కూలీలు అవసరం. ప్రస్తుతం దినసరి కూలీలు సైతం అమాంతం పెరిగిపోయాయి. ఒక మహిళా కూలీకి రూ.400 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి ఉండగా, పురుష కూలీలకైతే రూ.700 నుండి రూ.800 వరకు రోజుకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం టమోటో పంటలో ఊజీగా, చీడలు, కాయలకు మచ్చరోగం అధికంగా పట్టిపీడిస్తున్నాయి. పంట సాగుచేసినప్పటి నుండి నిరంతరం పురుగుమందులు, డ్రిప్ మందులు పిచికారీ చేస్తూనే ఉండక తప్పని పరిస్తితి. ఇక తీరా పంట చేతికొచ్చే సమయానికి ధరలు పూర్తిగా పడుతున్నాయి. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.ధరలు వచ్చి తమ జీవితాలు బాగుపడతాయనే కొండంత ఆశతో అప్పులు చేసి మరీ రైతన్నలు టమోటో సాగు చేయడం, తీరా నష్టాల రావడంతో అప్పులు తీర్చలేక చాలామంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఆనేకం. ఇదిలా ఉండగా చాలా మంది రైతులు టమోటా పంట సాగుచేసి నష్టాల ఊబిలో కూరుకుపోయి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచు కుంటున్నారు. బెంగళూరు, చెన్నై, హైదరబాద్ తదితర నగరల్లో వలసకూలీలు స్థిరపడిపోతున్నారు. కనీసం ప్రభుత్వమైనా పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తుందంటే అదీ లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత

సాగులో ఉన్న టమోటా పంట

గుర్రంకొండ మార్కెట్‌లో టమోటా పంట దిగుబడులు

ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. ధరలు పతనమైన సమయంలో తాము ఆ నిధి ద్వారా రైతులను ఆదుకోవడం జరుగుతుందని చెప్పినా, ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదు. మదనపల్లె డివిజన్‌లోని రామసముద్రం, మదనపల్లె, గుర్రంకొండ, తంబళ్లపల్లి, పెద్దమండ్యం, ములకలచెరువు, పిటిఎం, బి.కొత్తకోట మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాలుమ సాగులో ఉంది. సీజన్,అన్ సీజన్ అనే తేడా లేకుండా ఈ పంటను సాగుచేస్తున్నారు రైతులు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆర్థికంగా ఆదుకోవాలని, లేని పరిస్థితుల మా పరిస్థితి మరింత దుర్భరంగా మారే ప్రమాదం ఉందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భారీగా తగ్గిన ధరలు

టమోటా ధరలు భారీగా తగ్గాయి. 30 కిలోల బాక్స్ ప్రస్తుతం మొదటి రకం రూ.250ల ధర పలుకుతోంది. రెండో రకమైతే రూ.100 నుంచి రూ.200 ధర పలుకుతోంది. గిట్టుబాటు కావాలంటే రూ.800 అమ్మాల్సి ఉంది. కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

రైతు భరోసా రూ.50 వేలు ఇవ్వాలి

పంట పెట్టుబడి రోజురోజుకు అధికమవుతోంది. కూలీలు, అధిక ఎరువు ధరలు ఉండడంతో రైతులకు ఇచ్చే సాయం సరిపోవడం లేదు. రైతులకు రైతు భరోసా కింద ఇచ్చే 13,500 కాకుండా రూ.50 వేలు ఇవ్వాలి. పెట్టుబడి సాయం చేయాలి.

- రమేష్ బాబు, ఎపి రైతు సంఘం మాజీ జిల్లా కార్యదర్శి.

రూ.మూడు లక్షల నష్టం

ఎకరం టమోటా పంట సాగు చేశాను. ఎకరానికి దాదాపు రూ.3 లక్షల ఖర్చు వచ్చింది. పంటను మార్కెట్ తరలించగా చేతికి రూ.30 వేలు మాత్రమే వచ్చింది. ధర పతనం అవడంతో రూ.మూడు లక్షల మేర నష్టం వాటిలింది.

- మౌలా, రైతు, సంఘసముద్రం.

ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి

ప్రస్తుతం ధరలు పతనావస్థలో ఉన్నాయి. టమాటా రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. రైతులు అందరినీ ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. రైతులకు ఇచ్చే ఎరువుల ధరలలో సబ్సిడీ శాతాన్ని పెంచాలి. రైతులను ఆదుకొని ఆసరాగా ఉపాధి పనులను మంజూరు చేయాలి.

- నాయని జగదీష్, టిడిపి మండల అధ్యక్షులు.

విత్తన నాణ్యతకు పెద్దపీట

కడప జిల్లాలో 10 వేల క్వింటాళ్ల వేరుశనగ, అన్నమయ్యలో 60 వేల క్వింటాళ్ల విత్తనం సిద్ధం

40 శాతం సబ్సిడీతో విత్తనం అందజేత

ఎపి సీడ్స్ జిల్లా మేనేజర్ కె.జగదీష్ వెల్లడి

నాణ్యమైన విత్తన సరఫరా చేయడానికి ప్రాధాన్యత ఇస్తాం. ప్రతి ఏటా ఆయా జిల్లాల్లో ఎంపిక చేసిన పొలాల నుంచి వేరుశనగ, పొద్దుతిరుగుడు, బుడ్డశనగ, పచ్చిరొట్ట విత్తనాలు వంటి పలు పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాన్ని సేకరించడం తెలిసిందే. ఈ ఏడాది అనంతపురం జిల్లా నుంచి నాణ్యమైన విత్తనాన్ని సేకరించాం. వేరుశనగ విత్తనాన్ని 40 సబ్సిడీతో ఆర్‌బికెల ద్వారా రైతాంగానికి అందజేస్తాం. ఎపిసీడ్స్ మార్కెట్లో ఉన్న కారణంగా బయటి మార్కెట్లో ధరలు స్థిరంగా కొనసాగుతాయని, లేని పక్షంలో ధరలు అమాంతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఏతా వాతా తేలిదేమిటంటే ఎపిసీడ్స్ కొనుగోళ్ల కారణంగా మార్కెట్లో ధరల స్థిరీకరణ కొనసాగుతుందని ఘంటాపథంగా చెప్పవచ్చనడంలో సందేహం లేదు.

-ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

ఎపి సీడ్స్ విత్తన కొనుగోళ్ల గురించి తెలపండి?

కడప, అన్నమయ్య జిల్లాల్లో ఎంపిక చేసిన పొలాల నుంచి సరసమైన ధర ప్రాతిపదికన రైతుల నుంచి విత్తనాన్ని సేకరించడం జరుగుతోంది. ఈ ఏడాది కడప జిల్లాలో 10 వేల క్వింటాళ్ల వేరు శనగ, అన్నమయ్య జిల్లాలో 60 వేల క్వింటాళ్ల వేరుశనగ, 29 వేల క్వింటాళ్లలో బుడ్డశనగ, 200 ప్యాకెట్ల ప్రొద్దుతిరుగుడు, ఆరు వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేశాం. ఎపి సీడ్స్ మార్కె ట్ ప్రవేశం కారణంగా బహిరంగ మార్కెట్లో ధరలు అదుపులో ఉండటాన్ని ప్రత్యక్షంగా గమనించొచ్చు.

ప్రొక్యూర్‌మెంట్ విధానం గురించి చెప్పండి?

ఎపి సీడ్స్ విత్తన సేకరణకు సంబంధించి టెండర్లు పిలుస్తాం. అర్హత కలిగిన కంపెనీని ఎపి సీడ్స్ రాష్ట్ర ఉన్నతాధి కారులు ఎంపిక చేస్తాం. ఈ ఏడాది వరద అగ్రిటెక్, గంగాధర, సుబ్రమణ్యేశ్వర వెంకటేశ్వర, కర్మీసీడ్స్ ఏజెన్సీలు పాల్గొన్నాయి. రెండు, మూడు విడతల్లో ల్యాబ్ టెస్టింగ్ అనంతరం నాణ్యతను నిర్ధారించాం. విత్తన నిర్ధారణ అనంతరం జమ్మలమడుగు పట్టణ శివారులోని మోర్పి ప్రయివేటు వేర్‌హౌసింగ్ గోడౌన్‌లో నిల్వ చేశాం.

విత్తన నాణ్యతను ఎలా నిర్ధారణ చేస్తారు?

కడప, అన్నమయ్య జిల్లాల్లో ఎంపిక చేసిన పొలాల నుంచి విత్తనాన్ని కొనుగోలు చేస్తాం. విత్తన నాణ్యతకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు టెస్టింగ్, స్క్రీనింగ్, ఆస్పెక్టెడ్ వంటి సదుపాయాలను పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేస్తాం.

విత్తన సరఫరా గురించి తెలపండి?

కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని ఆర్బీకేలకు టెండరు దక్కించుకున్న ఏజెన్సీలు తమ వాహనాల ద్వారా సరఫరా చేస్తాం. కడప జిల్లాలో 280 ఆర్బీకేలు, అన్నమయ్య జిల్లాలో 390 ఆర్బీకేలకు సరఫరా చేయడం పరిపాటిగా మారింది. అన్నమయ్య జిల్లాలోని 11 మండలాల పరిధిలోని 186 ఆర్‌బికెలకు 29 వేల క్వింటాళ్ల మేర రూ.14 కోట్ల విలువైన బుడ్డశనగ విత్తనాన్ని, మరో తొమ్మిది మండలాల్లో 22 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు విత్తనాన్ని పొజిషన్ చేశాం.

సబ్సిడీ తగ్గుదలకు కారణమేమిటి?

విత్తన సబ్సిడీ హెచ్చుతగ్గులు ప్రభుత్వ పరిధిలోని అంశం. ఈ ఏడాది 40 శాతం సబ్సిడీతో వేరుశనగ, 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనం, 25 శాతం సబ్సిడీతో బుడ్డశనగ విత్తన సబ్సిడీలతో అందజేస్తున్నాం.

మార్కెట్ల పోటీ గురించి వివరించండి?

బహిరంగ మార్కెట్ల నుంచి పోటీని ఎదురవుతోంది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో పొద్దుతిరుగుడు విత్తనానికి ఎపి సీడ్స్ ధర రెండు కిలోల ప్యాకెట్ రూ.2,400 కాగా, ప్రయివేటు వ్యాపారులు రూ.200 తగ్గించి రూ.2,200 ధరలకు విక్రయిస్తున్నారు. ఎపి సీడ్స్ తగ్గిస్తే ప్రయివేటు వ్యాపారులు కూడా తగ్గించే అవకాశాలను స్పష్టంగా గమనించాం. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులను సంప్రదించాల్సిన అవసరం ఏర్పడింది. ఇటువంటి పోటీ వాతావరణం కారణంగా రైతులకు మోస్తరుగా లబ్ధిచేకూరుతోందని చెప్పవచ్చు. ఒకరకంగా ధరల స్థిరీకరణకు ఎపి సీడ్స్ కారణమవుతోందని చెప్పవచ్చు.

ఎపిసీడ్స్ వ్యాపార సరళి ఎలా నడుస్తోంది?

2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.60 కోట్ల మేర వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాం. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో రూ.50 కోట్ల వ్యాపారం నడిచింది.

ఆటో స్టాండ్‌ను ప్రారంభిస్తున్న సిఐటియు నాయకులు

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి : 'సిటు'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆటో కార్మికులందరూ ఐక్యంగా పోరాడినప్పుడే తమ సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు జిల్లా ఉపాధ్యకుడు హరిశర్మ పిలుపునిచ్చారు. మదనపల్లి రింగురోడ్డు సిఐటియు హనుమాన్ ఆటో స్టాండును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న పెట్రోలు, డీజిల్ స్పేరుపార్టుల ధరలతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా అపరాద రుసుము, కేసుల పేరుతో భారాలు మోపుతున్నదన్నారు. ఈపరిస్థితులలో ఆటో కార్మికుల జీవితాలు దుర్భరమవుతున్నాయన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సంఘాన్ని బలోపేతం చేసుకొని కలిసికట్టుగా పోరాడాలన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఆటోకార్మికులకు ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, అర్హులైనవారికి గృహవసతి కల్పించాలని డిమాండ్ చేశారు. పోలీసు, ట్రాన్స్‌పోర్టు అధికారుల నుండి అనవసర వేధింపులు ఆపాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించారు. కార్మికులందరూ ఐక్యంగా సిఐటియు ఆధ్వర్యాన పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సీనియర్ నాయకుడు చిన్నికృష్ణ, మాయబజార్ ఆటో స్టాండు కార్యదర్శి జగదీష్ ప్రసంగించారు. అనంతరం రింగురోడ్డు ఆటో స్టాండు అధ్యక్షులుగా ఎల్లప్ప, కార్యదర్శిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా భాస్కర, సహాయ కార్యదర్శిగా విజయకుమార్, ఐదుగురు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ నెల 11వ తేదీన జరిగే పట్టణ ఆటో డ్రైవర్ సంఘ మహాసభను జయప్రదం చేయాలని తీర్మానించారు.

కిడ్నీ పరీక్ష శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్, ఆధ్య ఆస్పత్రిలో కిడ్నీస్ కేర్ సెంటర్ డాక్టర్ సనత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ప్రోస్టేట్, కిడ్నీ పరీక్ష శిబిరానికి విశేష స్పందన లభించిందని ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి, కార్యదర్శి రెడ్డిశేకర్ తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు దాదాపు 100 మందికి ఉచితంగా చికిత్స చేశారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ కోశాధికారి ప్రసాద్ నాయక్, ఉపాధ్యక్షులు ఆది వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు వెంకటరమణ, సోమశేఖరయ్య, డిఇసి సభ్యులు హేమపతిరెడ్డి, రెడ్డిప్రకాష్, వీరాంజనేయులు, పెన్షనర్స్ సంఘ అధ్యక్షులు నరసింహులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగిని పరీక్షిస్తున్న డాక్టర్ సనత్‌రెడ్డి

చేనేత పరిశ్రమ కుదేలు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టు, నూలు ధరల పెరుగుదలతో చేనేత పరిశ్రమ కుదేలై యిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆర్అండ్‌బి అతిధి గృహంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కడప జిల్లా కమిటీ వీరనాల శివ నారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం పనిచేస్తుందని పేర్కొన్నారు. చేనేతను రక్షిస్తానని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాలు విస్మరించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేతకు అవసరమైన నూలు పట్టు ధరలు నూటికి నూరు శాతం పెంచిందని పేర్కొన్నారు. పట్టుదర రూ.3800 నుండి రూ.7 వేలకు, నూలు ధర రూ.1100 నుండి రూ.2 వేలకు పెంచారని వాపోయారు. దీంతో చేనేత పరిశ్రమ సంక్షో భంలో కురుకుందన్నారు. ఇది చాలదన్నట్లు చేనేతపై జిఎస్‌టి పన్ను 12 శాతానికి పెంచాలనే ఆలోచన దుర్మార్గపుతో పరిశ్రమ చీకటిలోకి నెట్టినట్లు అయిం దన్నారు. మహాత్మా గాంధీ బంకర యోజన, బీమా పథకాల ద్వారా 59 ఏళ్లకు చేనేత చనిపోతే రూ.60 వేలు ఇచ్చే వారని, కార్మికులకు ఐసిఐసిఐ లాంబార్డ్ స్కీం కింద హెల్త్ ప్యాకేజీ సంవత్సరానికి రూ.30 వేలు ఇచ్చేవారని చెప్పారు. వీటిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2017లో రద్దు చేసిందని వాపోయారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తను పాదయాత్ర సందర్భంగా తను అధికారంలోకి వస్తే చేనేత పరిశ్రమ రక్షిస్తానని వాగ్దానం చేశారు. ఆయన అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత చేనేత పరిశ్రమను మరణశయ్యపైకి నెట్టేశారని వాపోయారు. చేనేత పరిశ్రమకు బడ్జెట్లో కేటాయింపులు లేకుండా చేయడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం కింద రెండు లక్షల మగ్గాలు ఉండగా కేవలం 81 వేల 700 మందికి మాత్రమే అమలు చేయ డంతో మిగిలిన 1,20,000 మంది అన్యాయానికి గురయ్యారని వాపోయారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి చేనేత కార్మికునికి ఉపవృత్తుల వారికీ వైఎస్ఆర్ నేతన్ననేస్తం పథకం అమలు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికీ చేనేత గుర్తింపు కార్డులు లేక 60ఏళ్లు దాటిన వారు పింఛనుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముద్ర రుణాలు చేనేత కార్మికులు అందే విధంగా బ్యాం కులను ఒప్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం రూ. 5 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్లు కేటాయించాలని చెప్పారు. చేనేత సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి డక్క ఓబులేష్, చేనేత కమిటీ సభ్యులు డి వెంకటసుబ్బమ్మ, ఎంవెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు, చౌడం సంజీవ రాయుడు, బి.గోవర్ధన్, మలక వెంకటకృష్ణ, ఉమ్మడిశెట్టి జ్యోతి, పి.వసంత, కె.సావిత్రి, రంగప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

సిపిఎస్ రద్దు హామీని అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక మునుపు పాదయాత్రలో అడుగడుగునా దిక్కులు పిక్కటిల్లెల అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానంటూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి నాలుగేళ్లు కావస్తున్నా సిపిఎస్ రద్దు ఊసు ఎత్తకపోవడం ముఖ్యమంత్రి చేతకానితనానికి నిదర్శనమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు విమర్శించారు. ఆదివారం ఇంటింటికి యుటిఎఫ్‌లో భాగంగా ఓం శాంతి నగర్ లోని సిపిఎస్ ఉపాధ్యాయుల ఇళ్ల వద్దకు వెళ్లి సిపిఎస్ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఆవశ్యకతను తెలియజేశారు. సిపిఎస్ రద్దు కోరుతూ బ్యానర్ పై సంతకాలను, కరపత్రాలను పంపిణీ చేశారు. పాత పెన్షన్ విధానం తప్ప ఇతర ఏ ప్రత్యామ్నాయలకు అంగీకరించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎస్ కో-కన్వీనర్ అయ్యవారు రెడ్డి, నాయకులు బాబు, సూర్య ప్రకాష్, శివశంకర్, గంగన్న, సిపిఎస్ బాబు, విశ్వనాధ్, వీరనారాయణ, రామకృష్ణ, రసూల్‌బాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ధరల పెరుగుదలపై పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో నిత్యావసర, గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రమూ పట్టిం చుకోవడం లేదని మాజీ ఎంఎల్ఎ ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొ న్నారు. ఆదివారం 'ఇదేం కర్మ' కార్యక్రమాన్ని పట్టణంలోని కొత్తపల్లె వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు, ఇంటి పన్నులు భారీగా పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. యువతకు మూడనరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క ఉద్యోగమైనా ఇవ్వలేదని, కనీసం పరిశ్రమ కూడా స్థాపించలేదని వాపోయారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం వస్తుందని, ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. వైసిపి నాయకులు భూకబ్జాలకు, బెదిరింపులకు పాల్పడం అధికమమైందని వాపోయారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోనమాల ఖాదర్‌వలి, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి , రాజంపేట పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి వతన్ నిస్సార్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఎస్.కె హుస్సేన్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు అతావుల్లా, సోనీరాజ్ కలిమ్, టిడిపి నేతలు మైనుద్దీన్, బాబు రెడ్డి, మన్సూర్, ప్రసాద్, కొట్టే చలపతి మహబూబ్ బాష, అమవాస్య రెడ్డయ్య, ఇలియాజ్, ముబారక్ , హాజీ, అత్తర్ జావిద్, మహమ్మద్ జాఫర్, జమిల్ అహ్మద్, మూజీబ్, బర్కత్, ఫయాజ్, ఖాజా, మైనార్టీ మహిళలు నసీబ్ జాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న రమేష్‌రెడ్డి

నేడు యథాతథంగా స్పందన

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్క రించేందుకు సోమవారం 'స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రానికి రావాలని పేర్కొన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు రద్దు చేయాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రైతుల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లను పూర్తిగారద్దు చేయాలని ఎ పి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో అన్నమయ్య జిల్లా రైతు సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో తాగు, సాగు నీటికి సంబంధించిన హంద్రీ నీవా, గాలేరు నగరి ప్రాజెక్టులను 30 ఏళ్లయినా పూర్తి చేయలేకపోవారని పేర్కొన్నారు. పంటకు గిట్టుబాటు ధర, ఎం.ఎస్. స్వామినాధన్ కమిటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలన్నారు. జిల్లాలో అనబంధ వ్యవసాయమైన పాడి, మత్స్య పరిశ్రమల ప్రోత్సాహానికి ప్రభుత్వం చేయూతన ఇవ్వాలని పేర్కొన్నారు. సూక్ష్మబింద సేద్యం, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలన్నారు. రైతుల రుణాల వడ్డీ మాఫీ చేయాలని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల సాధన కోసం రైతుసంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. రామాంజులు, కెవిపిఎస్ కో-కన్వీనర్ డి.సి. వెంకటయ్య, రమేష్ బాబు, వెంకటరమణ రెడ్డి, నాగరాజు, శ్రీను, మాధవి, రమణయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ చేసిన తహశీల్దార్

ప్రజాశక్తి - గాలివీడు

మండలంలోని నూలివీడు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం తహశీల్దార్ దైవాదీనం తనిఖీ చేశారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎన్ని ఓటర్లు నమోదయ్యాయి, ఎంత మంది చనిపోయిన వారు ఉన్నారు, ఊరిలో లేని వారు, ఇతర దేశాలకు వెళ్లిన వారి వివరాలన బిఎల్‌ఒలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట బిఎల్ఒ శ్రీనివాసులు నరేంద్ర సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహశీల్దార్ దైవాదీనం

పాఠశాలలో ప్రార్థన షెడ్‌ను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

నూతన లయన్స్ క్లబ్ ఆవిర్భావం

- అధ్యక్షులుగా దగ్గుపాటి వెంకటేశ్వర్ నాయుడు

ప్రజాశక్తి -కలకడ

మండలంలోని బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నూతన లయన్స్ క్లబ్‌ను ఆవిర్భవించారు. నూతన క్లబ్ మొదటి సర్వీస్ గా ఉన్నత పాఠశాలలో రూ.5లక్షలతో మీటింగ్ షెడ్‌ను ఏర్పాటు చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మొత్తం 32 మంది సభ్యులుతో ఏర్పాటైన కమిటి ఏడాది పాటు సేవలు అందించనుంది.కమిటి అధ్యక్షునిగా దగ్గుపాటి వెంకటేశ్వర్ నాయుడు, కార్యదర్శిగా పునిత్‌చౌదరి, కోశాధికారిగా కుమార్ లాల్ జీలు బాధ్యతలు చేపట్టారు. నూతన క్లబ్ సభ్యులకు జిల్లా గవర్నర్ వినూత ప్రకాష్ అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. మొదటి వైస్ జిల్లా గవర్నర్ డాక్టర్ అర్.రామరాజు మాట్లాడుతూ నూతనక్లబ్ నేటి నుండి సేవా కార్య క్రమాలకు పునరంకితం కావా లని కోరారు. అలాగే కలకడ క్లబ్ సేవలు జిల్లాకు ఆదర్శం గా నిలవాలన్నారు. మదనపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు అప్పిన పల్లి భాస్కరాచారి మాట్లాడుతూ మదనపల్లి లయన్స్ క్లబ్ ఇకపై గ్రామీణ ప్రాంతాల కు సేవలు విస్తరించి, ఉచిత కంటివైద్య సేవలు అందిస్తుందని ప్రకటించారు. మరికొన్ని క్లబ్స్ ఏర్పాటు చేయడానికి కృషి చెస్తున్నట్లు తెలిపారు. ఎడిసిఎస్ గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే కలకడలో మోగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అప్పినపల్లి భాస్కరా చారి, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ జ్యోతి రామన్, కో-ఆర్డినేటర్ అరుణ్ కుమార్,రాకేష్ సేంద్వాల్, మస్తాన్,డేవిడ్ అబ్రహం, గంగాధర్, మహేష్, కెఎస్ఎస్ ప్రసాద్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - నిమ్మనపల్లి

మండల పరిధిలోని రెడ్డివారిపల్లి పంచాయతీ బురుజు మాదిగ పల్లెలో కోదండరామ దేవాలయ నిర్మాణానికి ఆదివారం ఉదయం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో హిందూ దేవాలయాల అభివృద్ధిలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ వారి ఆధ ్వర్యంలో కోదండరామ స్వాముల దేవస్థానాన్ని నిర్మించటానికి గ్రామస్తుల సమక్షంలో భూమి పూజ చేశామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు రూ.10 లక్షల రూపాయలను ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.రెడ్డమ్మ, వైసిపి నాయకులు నరేంద్ర రెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, డివిజన్ కన్వీనర్ దేవేంద్ర, మదనపల్లి కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, మండల కన్వీనర్ సోమేశ్వర, శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి నాగరాజా, గ్రామస్తులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందుకుంటున్న సొసైటీ సభ్యులు

టైలర్ల అభివృద్ధికి సొసైటీలు దోహదం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

టైలర్ల అభివృద్ధికి సొసైటీలు దోహదం చేస్తాయని జిల్లా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు తాజ్ బాషా, ఉపాధ్యక్షులు చిన్న టైలర్, కార్యదర్శి శంకర్, గోవిందులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల తరబడి సొసైటీలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్న తపన, కల నేటికి నెరవేరిందని అన్నారు. పదిమందికి ఉపయో గపడే విధంగా సేవాభాగ్యం కలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. మండలంలో 60 మంది టైలర్లు సొసైటీలో తమ పేర్లను నమోదు చేసుకున్నారని అన్నారు. 60 మంది సభ్యులను రెండు సొసైటీలుగా చేయడం జరిగిందని, రెండు సొసైటీలకు గోవిందు, శంకర్ అధ్యక్షులుగా నియమించినట్లు చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా టైలర్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.చంద్రమౌళి సహకారాన్ని అందించారని తెలిపారు. కేంద్రసహకార సంఘం బ్యాంకు నందు మన సొసైటీల పేరిట ఖాతాను తెరవాల్సి ఉంటుందని, ప్రభుత్వం నుండి గుర్తింపు కార్డులు వచ్చిన వెంటనే సమావేశం ఏర్పాటు చేసి అందరికి పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా గీతా జయంతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణానికి చెందినభగవాన్ గీతా సేవా సత్సంగ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆంజనేయ స్వామి దేవాలయంలో గీతా జయంతి వేడుకలు ఘనంగాజరిగాయి. సత్సంగ్ కమిటీ 35వ వార్షికోత్సవం సందర్భంగా అధ్యక్షులు మునీశ్వర్ రెడ్డి, కార్యాధ్యక్షులు తుంగవెంకటరమణారెడ్డి, కార్యదర్శి బొట్టా రామచంద్రయ్య నాయుడుల ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలు నిర్వహించారు. గీతా జయంతిని పురష్కరించుకొని స్థానిక సరస్వతీ విద్యా మందిరంలో రాజంపేట మండల పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులకు సత్సంగ కమిటీ సభ్యులు వై.నందకిషోర్‌గౌడ్, యు.పి.రాయుడు, చీనేపల్లి చంగయ్య, అరవ రమణయ్య, పలుకూరి వెంకటరమణ భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, శివ అంతర్యాగి గీతా జయంతి ప్రాధాన్యాన్ని వివరించారు. భగవద్గీత నాల్గవ అధ్యాయం జ్ఞాన యోగము నుండి నిర్వహించిన కంఠస్థ పఠన పోటీలలో వివిధ పాఠశాలల నుండి సుమారు నూరు మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను బహుమతులు ప్రదానం చేశారు. వీరికి సత్సంగ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు విలువైన పుస్తకాలు, జ్ఞాపికలతో, సర్టిఫికెట్ లతో సత్కరించారు. న్యాయ నిర్ణయతలుగా గంగనపల్లి వెంకటరమణ, పూల సుబ్బయ్య, రాజా మదన్మోహన్ రెడ్డి, పోతుగుంట నాగేశ్వరరావు, రావూరి గోపాలయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -నందలూరు

మండలంలోని 36 పోలింగ్ కేంద్రాలను, 3, 4ద తేదీల్లో ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించడం జరిగిందని మండల తహశీల్దార్ ఉదయ శంకర్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు 3, 4వ తేదీల్లో మండలంలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసేందుకు అనుగుణంగా బూత్ లెవెల్ ఆఫీసర్లకు సూచనలు సలహాలు చేశామని అన్నారు. అందులో భాగంగా 2021 సంవత్సరానికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు నమోదు చేసుకునేందుకు పదవ తరగతి మార్కు లిస్టు, లేదా ఆధార్ కార్డుతో ఫారం నెంబర్ 6 ద్వారా అప్లై చేసుకోవాలని సూచించారు. ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే ఫారం-8 ఇస్తే వాటిని మార్పులు చేర్పులు చేస్తామని, ఎవరైనా చనిపోయిన ఓటర్లు ఉంటే ఫారం-7 ద్వారా బిఎల్ఒ లకు ఇస్తే ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారిని తొలగించడం జరుగుతుందని అన్నారు. డిసెంబర్ నెలాఖర లోపల మార్పులు చేర్పులు జనవరి 2023 నాటికి కొత్త ఓటర్ల జాబితా విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.ఓటు హక్కు ఎంతో విలువైందని , 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తమ ఓటుహక్కును తప్పక నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ మోహన్ కృష్ణ, ఆర్ఐ రామాంజనేయులు, విఆర్ఒ చంద్రశేఖర్ రాజు , మండలంలోని బిఎల్ఒలు, విఒలు పాల్గొన్నారు.

'పల్లెజీవం'..జాడెక్కడ..?

- రైతుల వద్ద వసూలు చేసిన సొమ్ము ఏమైందో!
- పట్టించుకునే నాధుడెవరూ లేరు
- లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - గుర్రంకొండ

పల్లె రైతును ఆర్థికంగా అభివృద్ధి చేస్తూ సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని మండలంలోని మూడు గ్రామాలను ఒక గొడుగు కిందకు తీసుకు వచ్చే సరికొత్త పేరుతో 'పల్లె జీవం' అంటూ రూ.కోట్ల నిధులు దుర్వినియోగం అవుతున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పల్లెజీవం రైతులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలలో పల్లె జీవం ప్రాజెక్ట్ కింద సంఘసముద్రం, ఎల్లుట్ల, టి.పసలవాళ్లపల్లి గ్రామ పంచాయతీలలో సుమారు 500 శాశ్వత సభ్యులు ఉన్నారు. పల్లె జీవం ప్రాజెక్ట్ కింద పై గ్రామాలను దత్తత తీసుకొని గ్రామాలలోని రైతుల అభివృద్ధికి ప్రతి రైతు నుంచి రూ.వెయ్యి, ప్రాజెక్టు నుంచి రూ.వెయ్యి మొత్తం రూ.రెండు వేలతో పల్లె జీవంలో ఉన్న రైతులందరినీ అభివృద్ధి చేస్తామంటూ అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ మేరకు నిధులను రైతుల వద్ద నుంచి వసూలు చేశారు. ఇదే కాకుండా ప్రభుత్వం నుంచి రూ.కోట్ల ప్రాజెక్టుకు అందించింది. ఈ సొమ్ముతో పల్లె ప్రగతి కోసం పల్లె జీవంతో గ్రామాలలో పాడి పరిశ్రమలు, గొర్రెల పెంపకం, వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్, చిన్న చిన్న పరిశ్రమలు నియమించి ప్రతి ఇంటా పసిడి పంటలు పండే విధంగా ప్రాజెక్ట్ అధికారులు ముందుంటారని నమ్మించారు. సభ్యత్వానికి రూ.వెయ్యి కట్టిన సభ్యులకు వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్‌తో పాటు రైతులకు కావల్సిన వ్యవసాయ పనులన్నీ సగం ధరకే ఇస్తామనడంతో రైతులందరూ ఎగబాకి సభ్యత్వాలను నమోదు చేశారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో పల్లె జీవం ట్రాక్టర్ కోసం

గుర్రంకొండలో ఉన్న పల్లెజీవం కార్యాలయం(ఫైల్‌ఫొటో)

రైతులు ఎదురు చూస్తున్నా అధికారులు పటించుకోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు అధికార పార్టీ నాయకునికి ట్రాక్టరు, ట్రాక్టర్ ట్యాంకర్లులను అప్పజెప్పడంతో రోజుకు రూ.మూడు వేలు చొప్పున నెలకు రూ.లక్ష వరకు వచ్చే ఆదాయాన్ని, ట్రాక్టర్‌ను దుర్వినియోగం పరుస్తున్నాడని సంఘ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇకనుంచైనా అధికారులు సంఘ సభ్యుల, పల్లె జీవం అభివృద్ధికి పాటు పడాలని రైతులు కోరుకుంటున్నారు.

కార్యాలయం ఎక్కడుందో తెలియదు

పల్లె జీవం సంఘసముద్రం కార్యాలయం గతంలో మండల కేంద్రంలోని గుర్రంకొండలో ఉండేది. ప్రస్తుతం ఆ కార్యాలయం ఎక్కడుందో తెలియక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్, ఫామ్ పండ్, పశువుల దాణ, ఇతర వాటి కోసం ఎక్కడికి వెళ్లాలో అర్థం కావడం లేదని, సంస్థలో నాయకుల పెత్తనమే ఎక్కువ అయిపోయిందని రైతులు వాపోతున్నారు.

ఆరోగ్యానికి చిరునామా ఆయుర్వేదం

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ లోకేష్ రెడ్డి

పజాశక్తి-కలికిరి

ఆరోగ్యానికి చిరునామా ఆయుర్వేదం అని ఆయుర్వేదిక్ వైద్యులు దివ్య, దీప్తిలు తెలిపారు. ఆయుర్వేద పితామహుడు ఆచార్య చరకుడు ప్రారంభించిన సనాతన భారతీయ సాంప్రదాయ వైద్య విధానం ఆయుర్వేదమని ఆరోగ్య పరిరక్షణలో అది కీలక భూమిక నిర్వహిస్తుందని అన్నారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి సి.సురేంద్ర రెడ్డి, అధ్యక్షులు వై.ఆదినారాయణరెడ్డి, ప్రముఖ రచయిత వేంపల్లి అబ్దుల్‌ఖాదర్, వర్కింగ్ కార్యదర్శి జయరాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంపు కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, దివ్య, స్థానిక ఎస్ఐ లోకేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక పౌర సమాజంలో మనిషి జీవనశైలి మారిపోయిన కారణంగా వివిధ రకాల వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. జంక్ ఫుడ్స్ తప్పని సరై, నాణ్యమైన ప్రకృతి సిద్ధమైన ఆహార విధానం కనుమరుగైందని ఆవేదన చెందారు. సైడ్ ఎఫెక్టులేని శాశ్వత పరిష్కారం చూపే ఆయుర్వేద విధానం సదా అనుసరణీయమని వ్యాఖ్యా నించారు. నిత్యజీవితంలో తీసుకునే ఆహారంలోని ప్రతిదీ ఆయుర్ ఔషధ గుణాలు కలిగినదేనని గుర్తు చేశారు. 60 మంది రోగులకు 40,000 విలువ చేసే ఔషధాలను పంపిణీ చేశారు. ఎస్సై రిబ్బన్ కత్తిరించి ప్రారంభిస్తే రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వి ముని వెంకటప్ప జ్యోతి వెలిగించారు. కార్యక్రమంలో సి సత్యనారాయణ రావు, ఏ సత్యనారాయణమూర్తి, ట్రెజరర్ పి మస్తాన్ ఖాన్, టి.సరోజమ్మ, ఆర్. నారాయణరెడ్డి, ఎం.కాంతమ్మ, ఆనంద రెడ్డి, పి.రామచంద్రయ్య, రాజకుమారి, ఈసీ వెంకటస్వామి, వెంకటరమణ, రోగులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతులకే పట్టం కడదాం

- ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, పెన్షనర్ల సంఘాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ :

ఉద్యోగ, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై అవగాహన కలిగి, వాటి పరిష్కారం కోసం అనునిత్యం పాటు పడుతున్న ఉద్యమనేతలు కత్తి నరసింహా రెడ్డి, పోతుల నాగరాజులను పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌టియు, యుటిఎఫ్ నాయకులు సుబ్రమణ్యం రాజు, జగన్ మోహన్ రెడ్డి, హరిప్రసాద్, జాబిర్‌లు పేర్కొన్నారు. పశ్చిమ రాయలసీమఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థుల పరిచయసభ ఆదివారం రాజంపేటలోని జిల్లా పరిషత్తు ఉర్దూ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడిగా, ఫ్యాప్టో ఛైర్మన్‌గా జెఎసికో-చైర్మన్ గా పనిచేసిన విశేష అనుభవంతో పాటు, విద్యారంగంలోనే తన జీవితాన్ని గడుపుతున్న కత్తి నరసింహారెడ్డిని మరోమారు ఆదరించా లన్నారు. అదేవిధంగా సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు, పలురకాల ఉపాధ్యాయ ఉద్యమాలలో పాల్గొంటున్న పోతుల నాగరాజును గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపిం చాలన్నారు. మేధావులు ఉండాల్సిన శాసన మండలిలో రాజకీయ పార్టీలకు, కార్పొరేట్ శక్తులకు అవకాశం ఇవ్వరాదన్నారు. ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులైన కత్తి నరసింహా రెడ్డి, పోతుల నాగరాజులు మాట్లాడుతూ రాజీలేని పోరాటాలు చేసే ఉద్యమసంఘాల నుండి వచ్చిన తమను ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులు ఆదరించాలని కోరారు. బోగస్ ఓట్ల నమోదులో అనైతిక చర్యలకు పాల్పడిన వారి మీద రాష్ట్ర , కేంద్ర ఎన్నికల కమీషన్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఓటు నమోదు వివిధ

సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి

కారణాలతో ఇంకా నమోదు చేయిం చుకోని వారు తప్పనిసరిగా ఫారం-19 మరియు ఫారం-18లు పూర్తి చేసి, సర్టిఫికెట్లు జతపరచి, ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియూ రాష్ట్ర కార్యదర్శులు కెబాలగంగి రెడ్డి, ఆది నారా యణ రెడ్డి, యూ టి ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు డి.చెంగల్ రాజు, క్రిష్ణా రెడ్డి , జిల్లా కార్యదర్శి పి.వెంకట సుబ్బయ్య, సీనియర్ నాయకులు ఎం.నాగేశ్వర్ గౌడ్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఎఐటియుసి జిల్లా నాయకులు పి.ఎల్‌నరసింహులు, ఏఐటియుసి నాయకులు టి.రాధాకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఏఐ ఎస్ఎఫ్ నాయకులు మహమ్మద్, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల ప్రతి నిధులు, విద్యార్థి సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తు కోసమే గర్జన

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పిల్లల భవిష్యత్తు కోసమే రాయలసీమ గర్జన కార్యక్రమం జరుగుతుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ రాయలసీమ జెఎసి ఆధ్వర్యంలో సోమవారం కర్నూల్‌లోని ఎస్‌టిబిసి మైదానంలో న్యాయ రాజధానిని కర్నూల్ చేయాలని కోరుతూ నిర్వహించే రాయలసీమ గర్జన కార్యక్రమానికి భారీగా తరలివెళ్లి సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని విషయంలో రెండు సార్లు తీరని అన్యాయం జరిగిందన్నారు. నాడు మద్రాసు నుంచి, 2014లో హైదరాబాద్ నుంచి తరిమారని, దీంతో జరిగిన లోటు తీర్చలేనిదన్నారు. శ్రీకృష్ణ కమిటీ, శివరామకృష్ణ కమిటీ, శ్రీబాగ్ కమిటీ నివేదికలు, విభజన హామీ ప్రకారం కర్నూలు న్యాయం చేయాల్సి ఉన్నా గత టిడిపి ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని అనేక ఉద్యమాలు జరిగినా స్పందించకుండా అమరావతిలో అభివృద్ధి అంతా పెట్టారని చెప్పారు. దీంతో భవిష్యత్తులో అలాంటి పరిస్థితి వస్తే

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల

రాయలసీమ గత ఏమిటని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో జేఏసీ ఆధ్వర్యంలో జరిగే రాయలసీమ గర్జనలో ప్రతి ఒక్కరూ పాల్గొని, సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సీమకు మరోసారి అన్యాయం జరగకుండా అధికార వికేంద్రీకరణకు సీఎం జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, మధన మోహన్ రెడ్డి, కృష్ణమోహన్, మురళీప్రసాద్, కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో వైసిపి విఫలం

ప్రజాశక్తి- కలికిరి

ప్రజా సమస్యల పరిష్కారంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి నాయకులు ఎర్రం రెడ్డి అన్నారు. మన రాష్ట్రానికి ఇదేంఖర్మ కార్యక్రమాన్ని యూనిట్ ఇంచార్జ్ యర్రమరెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో యూనిట్ ఇంచార్జి ఎర్రంరెడ్డి. అధ్యక్షతన ఇందిరమ్మ కాలనీలో ఈ రాష్ట్రానికి ఇదేంఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తూ రాబోయే ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో అగస్త్యేశ్వర్. శ్రీనివాస్ వర్మ, మానేరు వెంక టరమణ రాజా. జ్ఞాన, టీవీ రమణ, వాటర్ షెడ్ రవికుమార్, రాంబాబు, శేషాద్రి, బీసీ నాయకుడు లక్ష్మన్న, వెంకట్ నాగులు, మైనార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

శాంతి కోసమే సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రపంచ శాంతి కోసం ఓ వ్యక్తి సైకిల్ యాత్ర ప్రారంభించాడు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింధనూరు పట్టణానికి చెందిన విజయ గోపాల్ కృష్ణ 11 రాష్ట్రాల్లో పర్యటిస్తూ ప్రముఖ దేవాలయాలు, నదులను సందర్శించి, 360 రోజులు సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో 250వ రోజు సైకిల్ యాత్ర పూర్తి చేసుకుని ఆదివారం అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలోని శ్రీ పట్టాభిరాముడిని దర్శించుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ప్రారంభమైన సైకిల్ యాత్ర నాగ్‌పూర్, తుల్జాపూర్, షిరిడి, నాసిక్, త్రయంబకేశ్వరం, గుజరాత్ రాష్ట్రంలోని నర్మదానది, నాందేడ్, బాసర, త్రివేణి, కాశీ, అయోధ్య, ఆగ్రా, లక్నో, మధుర, హరియాన, పంజాబ్, సింధూనది తదితర ప్రాంతాల గుండా సైకిల్ యాత్ర సాగించారు. దేశంలో అన్యాయాలు, అక్రమాలు జరగకుండా, మత ఘర్షణలు, విద్వేశాలు లేకుండా ఉండి, దేశం శాంతితో ఉండాలని సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు విజయగోపాల్ కృష్ణ తెలిపారు. ప్రస్తుతం రామేశ్వరం వైపు తన సైకిల్ యాత్ర సాగిస్తున్నట్లు తెలిపారు.

డ్రెయినేజీ పనులకు రూ.6 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్థానిక కొత్తపేటవీధిలోని జిలాని బిల్డింగ్ వద్ద నుంచి పశు సంవర్ధకశాఖ కార్యాలయం వరకు మురికి కాలువ సమస్య ఉండడంతో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో జడ్పీ నిధుల నుంచి రూ.6లక్షలు విడుదల అయినట్లు ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, ఇఒ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక కొత్తపేటవీధిలో పర్యటించి, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. త్వరలోనే డ్రైనేజీ పనులను పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

డ్రెయినేజీ పనులను ప్రారంభిస్తున్న ఉపసర్పంచ్ కేశవ రెడ్డి

కేక్‌కట్ చేస్తున్న మిరియాల సురేఖ

విభిన్న ప్రతిభావంతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ :

పట్టణంలోని మన్నూరులో విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం కార్యాలయం లో అబ్దుల్ ఖాదర్ అధ్యక్షతన వికలాంగుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు చేర్లోపల్లి రెడ్డప్ప, పట్టణ మహిళా కార్యదర్శి మిరియాల సురేఖ చేతుల మీదుగా కేక్‌కట్ చేశారు. ఈసందర్భంగా సురేఖ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ప్రతేకమైన నైపుణ్యాలు కలిగి ఉంటారని అన్నారు. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. వికలాంగుల పట్ల వివక్ష చూపకుండా వారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని అన్నారు. రెడ్డప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. వికలాంగుల రిజర్వేషన్ 4శాతానికి పెంచడం, పింఛన్లు సరిసమానంగా చేయడం మొదలైన చర్యలు తీసుకోవడం వలన వికలాంగుల అభివృద్ధికి దోహదం చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్రనాయకులు గుణశేఖర్, పుల్లంపేట అద్యక్షుడు సుబ్బా నర్సా రెడ్డి, వాలంటీర్ సుధాకర్, శ్రీను, జైనుల్ పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ప్రసాద్‌బాబు

శ్రీవిద్య ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని గాలివీడు రోడ్డులో నూతన ఏర్పాటుచేసిన శ్రీవిద్యాహాస్పిటల్ ను టిటిడి మాజీ పాలకమండలి సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేదప్రజలకు వైద్యులు వైద్యంతో పాటు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈసందర్భంగా ప్రసాద్ బాబును వైద్యులు శాలువ కప్పి సన్మానం చేశారు. చిన్నపిల్లలు, పురిటిబిడ్డ వైద్యులు డాక్టర్ రమేష్ రాజు , జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రామరాజుల వైద్య సేవలు గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని కన్యమడుగు ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పి.చరణ్‌రెడ్డి, ఆర్.అనిల్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. సుబ్రహ్మణ్యం, పీడీ జలజ తెలిపారు. నవంబర్ 24వ తేదీన తిరుపతి రామచంద్రపురం ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి యోగ పోటీలలో అండర్-14 విభాగంలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. వీరు పిఆర్‌అంబేద్కర్ కోనసీమలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, పిడి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంఇఎఫ్ నూతన కమిటీ

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎస్‌సి వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎంఈఎఫ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు పిచ్చికెబాబు మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎంఈఒ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద క్రిష్ణమాదిగ పిలుపు మేరకు ఎంఈఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు.గౌరవ అధ్యక్షులుగా సి.ఆర్‌మోహన్, అధ్యక్షులుగా పి.శంకర్, ఎన్.వెంకటసుబ్బయ్య, పధాన కార్యదర్శిగా కె.రమేష్ బాబు, సహాయ కార్యదర్శిగా డి.వెంకటరమణ, కోశాధికారిగా టి.చంద్రశేఖర్, గౌరవ సలహాదారులుగా నాగ సుబ్బరాయుడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పిచ్చికె బాబు మాదిగ మాట్లాడుతూ జనవరి 8న అనంతపురంలో జరిగే ఎం.ఈ.ఎఫ్ జాతీయ మహాసభను జయప్రదం చేయడంలో భాగంగా డిసెంబరు 10న కడపలో జరిగే ఐదు జిల్లాల ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే మాదిగల చిరకాల ఆకాంక్ష ఎస్‌సి వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాల కన్వీనర్ వెలగచర్ల శివయ్య మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.చంద్రశేఖర్, పెంచలయ్య, వెంకటేష్, శివయ్య పాల్గొన్నారు.

నాగేంద్ర యాదవ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నమానవతా సభ్యులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- లక్కిరెడ్డిపల్లి

మండలంలోని గంగనపల్లికి సిఆర్‌పి నాగేంద్ర యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆదివారం మానవత సభ్యులు సంస్మరణసభ నిర్వహించి నివాళులర్పించారు. మానవతా జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, చైర్మన్ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఈ నగదు నాగేంద్ర యాదవ్ కుటుంబానికి రూ.20 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యూ సినిమా పాట రచయితగా మంచి పేరు సంపాదించుకొని సినిమా రిలీజ్ కాకముందే నాగేంద్ర రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. విద్యాశాఖ నాగేంద్రయాదవ్‌కు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. నాగేంద్ర కుటుంబానికి అండగా నిలిచి వారి పిల్లల భవిష్యత్తుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మానవతా సభ్యులు రామాంజనేయులు హెచ్.సి.శ్రీనివాసులు రామకృష్ణ సుబ్బారెడ్డి , కో-చైర్మన్ శివ శంకర్ రెడ్డి , న్యాయవాది బాలాజీ రెడ్డి సినిమా డైరెక్టర్ శ్రీనివాసులు, హీరో సాయి చరణ్, మానవతా సభ్యులు పాల్గొన్నారు.